

తలనీలాలు పోగుచేసుకోవట్లే

వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆలయ అధికారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. 8లో▸



కరెంట్‌తో జరభద్రం

ఏటా వర్షాకాలం విద్యుదాఘాతంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈసారి భారీ వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ కాస్తుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

రోడ్లు, చెరువులను పరిశీలించిన కలెక్టర్



కొచ్చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్: ఇటీవలి వర్షాలకు నష్టపోయిన మండలంలోని రోడ్లు, చెరువులను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. గంభీర్‌పూర్ శివారులోని కొచ్చెరువు మత్తడి ఓ వైపు కూలి నీరంతా వృథాగా వెళ్తుండడంతో నీటిపారుదలశాఖ అధికారులతో చర్చించారు. త్వరగా మరమ్మతు చేయించాలని ఆదేశించారు. పోతారం శివారు గిరిజన తండాకు వెళ్లే రోడ్డు కోతకు గురికాగా.. మరమ్మతు చేయించాలని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులకు సూచించారు. ఇప్పపెల్లిలో ధ్వంసమైన తారు రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, నీటిపారుదలశాఖ అధికారి రమేశ్, డీఈ ప్రశాంత్, తహసీల్దార్ ముంతాజి బొద్దీన్, ఎంపీడీవో శంకర్ ఉన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

కొండగట్టు(చొప్పదండి): భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొడిమ్యాల మండలం కొనాపూర్, సంద్రల్లపల్లె వెళ్లే బ్రిడ్జిలను పరిశీలించారు. మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు.

లింగ నిర్ధారణ నేరం

- జగిత్యాల ఆర్డీవో మధుసూదన్



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

జగిత్యాల: లింగనిర్ధారణ నేరమని, స్కానింగ్ సెంటర్లకు వచ్చే వారికి పరీక్షలు చేయొద్దని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్కానింగ్‌కు వచ్చే ప్రతిఒక్కరి వివరాలు నమోదు చేయాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఆయన వెంట మాతాశిశు సంక్షేమాధికారి జైపాల్‌రెడ్డి, వైద్య బృందం ఉన్నారు.

ఎస్సారెస్పీ గేట్లు మూత

జగిత్యాలరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం నిలిచిపోవడంతో ఎస్సారెస్పీ గేట్లను పూర్తిగా మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 80.5 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్ట్‌లోకి 67,507 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 8,867 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కాకతీయ మెయిన్ కాలువకు 5500 క్యూసెక్కులు, ఎస్కేప్ ద్వారా 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కోసం 231 క్యూసెక్కుల, వరదకాలువకు 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్–2 పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 33/11 కేవీ విద్యానగర్ సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. పాతబస్టాండ్, విద్యానగర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రోడ్, రాజీవ్‌చౌక్, ధర్మపురి బైపాస్‌రోడ్, గాయత్రి దేవాలయం ప్రాంతం, గొల్లపల్లి రోడ్, తాతమ్మగుడి, విజయపురి, దయాల్‌నగర్, బైపాస్‌రోడ్, సీతారాంనగర్, శంకులపల్లి, బీరయ్యగుడి, కొత్తవాడ, హనుమాన్‌వాడ, గంజ్‌స్ట్రీట్, ఖాజీపుర, ఉస్మాన్‌పుర, హజారీవీధి, సుతారిపేట, వంజరివాడ, లడ్డుఖాజా చౌరస్తా, శివవీధి, అన్నపూర్ణ చౌరస్తా, మిషన్ కాంపౌండ్, బ్రాహ్మణవాడ, ప్రభుత్వ ఆస్పత్రి తహసీల్ చౌరస్తా, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట, పెర్కపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ సుందర్ తెలిపారు. లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

8న మెట్‌పల్లిలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 8న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి గురువారం తెలిపారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు అదేరోజు ఉదయం 9గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

జిల్లాపై జ్వరాల పంజా

- అదుపులోకి రాని వ్యాధులు
- ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్న బాధితులు
- వచ్చీరాని వైద్యం చేస్తున్న వైనం
- కాస్త ఉపశమనం అనిపించినా మళ్లీ అస్వస్థత



గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

జగిత్యాల: జిల్లాలో విషజ్వరాలు అదుపులోకి రావడం లేదు. పరిసరాల పరిశుభ్రతపై వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నా.. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా పరిస్థితిలో మార్పు మాత్రం రావడంలేదు. విషజ్వరాలతో బాధపడుతున్న చాలామంది ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులతో బాధపడుతున్నవారు మరికొందరు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

వచ్చీరాని వైద్యం..

గ్రామీణ వైద్యులుగా పిలవబడే ఆర్‌ఎంపీ, పీఎంపీలు వచ్చీరాని వైద్యం చేస్తూ మమ అనిపిస్తున్నారు. వారికి తెలిసిన మందులతోపాటు మోతాదుకు మించి ఇంజిక్షన్లు ఇస్తున్నారు. మోతాదుకు మించి మందులు ఇస్తుండడంతో రోగులు కాస్త ఉపశమనం పొందుతున్నా.. రోజు గడవకముందే రోగం తిరగబడి మళ్లీ అస్వస్థతకు గురవుతున్నారు. ప్రథమ చికిత్స మాత్రమే అందించాల్సిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఇష్టానుసారంగా సెలైన్లు పెడుతుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణంలో మార్పులతో ప్రతి ఇంట్లోనూ జ్వర పీడితులు పెరిగిపోతున్నారు. పట్టణ ప్రజలు స్థానిక ఆస్పత్రులకు వెళ్తుండగా.. గ్రామీణ ప్రజలు మాత్రం సమీపంలోని పీహెచ్‌సీ, ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వారు బాధితులకు అధిక మోతాదులో స్టెరాయిడ్స్ ఇస్తుండడంతో కాసేపు ఉపశమనంలా అనిపిస్తోంది. కొందరు ఏకంగా రక్తనమూనాలు తీసుకుంటూ గుర్తింపులేని ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తున్నారు. ఇలా వారికి ఎలాంటి జ్వరమో తెలియకపోవడంతోపాటు వచ్చీరాని వైద్యం అందిస్తున్నారు. మరికొందరు డెంగీ అని, చికున్‌గున్యా సోకిందని, మలేరియా వచ్చిందని చెబుతూ రోగులను భయపెడుతున్నారు.

పరిధి దాటి చికిత్స..

ఆర్‌ఎంపీలు వాస్తవానికి రోగిని పరిశీలించి ప్రథమ చికిత్స మాత్రమే చేసి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాల్సి ఉంటుంది. కానీ.. వారే ఇంజక్షన్లు ఇవ్వడం, సెలైన్‌లు పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. మోతాదు మించి పెయిన్‌కిల్లర్లు ఇవ్వడంతో రోగికి లక్షణాలు బయటపడడం లేదు. దీంతో జబ్బు ముదిరిపోవడం.. ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. డెంగీ వంటి వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో పెయిన్ కిల్లర్స్ ఇవ్వొద్దని వైద్యులు చెబుతున్నారు. సెలైన్లు ఎక్కువగా పెట్టుకోవద్దని, రోగి బరువు బట్టి ఇవ్వాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. 70 కిలోలు ఉన్న మనిషికి 750ఎంఎల్ సెలైన్ పెట్టాల్సి ఉన్నా.. ఒకటి నుంచి రెండు వరకు సెలైన్లు ఎక్కిస్తున్నారు. దీంతో రోగి కొద్దిసేపు హుషారుగా కనబడినా.. లోలోపల రోగం మాత్రం తగ్గదని, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. జ్వరం బారిన పడితే పారాసిటమల్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తాగించాలని, బీకాంప్లెక్స్ ఇవ్వాలని పేర్కొంటున్నారు.

పెయిన్ కిల్లర్స్‌తో డేంజర్



జ్వరం వచ్చినప్పుడు పారాసిటమల్, ఓఆర్‌ఎస్ మాత్రమే వాడాలి. డైక్లోసినాక్, హైడ్రోకాటిసోన్, డెక్రాడాన్ వంటివి వాడితే ఇబ్బందికరంగా ఉంటుంది. ఇవి జబ్బు లక్షణాలను మాస్క్ చేస్తాయి. ఫలితంగా ప్లేట్‌లెట్స్ తగ్గి మరింత జ్వరం పెరిగే అవకాశాలుంటాయి. ప్రజలు గ్రహించాలి. సెలైన్లు అవసరమైతేనే పెట్టాలి.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

వారిదే ఇష్టారాజ్యం...

వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రోగాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం లేదు. ఇళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, పూలకుండీలు, తొలగించిన టైర్లలో నీటిని తొలగించాలని చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మంత్రి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు





జగిత్యాల/కోరుట్ల: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్, కోరుట్లలోని పీవీ నరసింహారావు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ దాసరి శ్రీనివాస్ ఉత్తమ అధ్యాపకులుగా ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రశంస అందుకున్నారు.

‘మహిళాశక్తి’తో ఆర్థికాభివృద్ధి

- ఐకేపీ ఏపీడీ చరణ్‌దాస్



మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న చరణ్‌దాస్

జగిత్యాలరూరల్: మహిళాశక్తి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఐకేపీ ఏపీడీ చరణ్‌దాస్ అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్, రెడీమేడ్ దుస్తులు, లేడీస్‌వేర్, నాటుకోళ్ల పెంపకం యూనిట్లను పరిశీలించారు. జిల్లాలో మహిళాసంఘాల సభ్యులకు జీవనోపాధి కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి కార్యక్రమం ద్వారా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పుకునేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో వివిధ బ్యాంకుల ద్వారా లింకేజీ, వ్యక్తిగత రుణాలు పీఎంఎఫ్‌ఎంఈ, స్త్రీనిధి రుణాల ద్వారా సభ్యులకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం విజయలక్ష్మీ, మల్లేశ్, వనజ, వెంకటేశ్, ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్, గంగారాం, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ సాహిత్య, మండల సమైక్య అధ్యక్షురాలు సత్తవ్వ, గంగభవాని పాల్గొన్నారు.

ఎరువుల గోదాం ప్రారంభం



గోదాంను ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్

బుగ్గారం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుగ్గారంలో నిర్మించిన ఎరువుల గోదాంను డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గోదాంతో దూరప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తీరాయన్నారు. పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు పెరుక రమేశ్, బలిజపెల్లి లింగన్న, నూర లక్ష్మీ, పల్లి అశోక్, కుమ్మరి రవి పాల్గొన్నారు.

వర్షాల వేళ.. పంటల సస్యరక్షణ

- చేలలో నీరుంటే కుళ్లిపోయే అవకాశం
- మెలకువలతో నష్ట నివారణ
- రైతులకు వ్యవసాయాధికారుల సలహాలు



మల్లాపూర్‌లో నీట మునిగిన వరిపంట

మల్లాపూర్ : జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. పొలాల్లో నీరు నిలిచి పంట కుళ్లిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు చీడపీడలు ఆశిస్తున్నాయి. సకాలంలో చర్యలు తీసుకోకుంటే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పంటల వారీగా జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని నివారించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

వరి..

- వరి ప్రస్తుతం దుబ్బు పోసే దశలో ఉంది. ఎండుఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. కాండం కుళ్లు నివారణకు 2.5 గ్రాముల కార్బండజిమ్, మ్యాంగోజెబ్ లేదా మిల్లీలీటరు మైసిన్ వాలిడామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులు గమనించినట్లయితే 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. రెండో దఫా యూరియా వేసుకోవడానికి అనుకూలమైన సమయం. ఎండాకు తెగులు ఆశిస్తే నత్రజనిని మోతాదుకు మించి ఉపయోగించకూడదు.

మొక్కజొన్న..

- నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఉదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పంట గింజపోసే దశలో ఉంది. వర్షాలు తగ్గిన తర్వాత 5 గ్రాముల 19–19–19 లేదా 20 గ్రాముల డీఏపీ మందును లీటర్ నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు, ఆకుఎండు నివారణకు ఎకరానికి 400 మి.లీ ప్రొఫినోపాస్, 200 మి.లీల ప్రొఫికొనజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి చేను బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

కంది..

- కంది చేనులో ఉన్న నీటిని ముందుగా తీసివేయాలి. ఈ పంటలకు ఎక్కువగా కాండం కుళ్లు ఆశిస్తుంటుంది. లీటరు నీటిలో రెండు గ్రాముల మెటలాక్సైల్ మందును కలిపి పిచికారీ చేయాలి.

మిరప..

- నారుమళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నారుకుళ్లు తెగులు, నారుమళ్లను ఆశిస్తే లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల రిడోమిల్ కలిపి వారంలో రెండు, మూడుసార్లు నారుమళ్లను తడపాలి.

పత్తి

- పత్తి ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. కలుపు నివారణకు లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్ల క్విజాల్‌పాప్ ఇథైల్, 1.25 ఎంఎల్ పైరిత్రిబాక్ సోడియం మందును కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌కు కలిపి పిచికారీ చేయాలి.

పెసర , మినుము ..

- పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉంది. లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ కలిపి పిచికారీ చేయాలి. 20 నుంచి 25 రోజుల దశలో ఉన్న పంటలో కలుపు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అంతర సేద్యం కానప్పుడు పెసర, మినుము పంటలో ఎకరాకు 200 మీ.లీ ఇమిజిథాఫిర్‌ను 200 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు వాడినప్పుడు పంట పెరుగుదల వారం రోజులు ఆగుతుంది. తరువాత తేరుకుని మామూలుగా ఉంటుంది. వర్షాలకు ఆకుపచ్చ తెగులు ఆశించే ఆవకాశం ఉంది. నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

సలహాలు, సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. పంటలకు నష్టం జరగకుండా రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు అప్రమత్తంగా ఉండాలి. – వాణి, డీఏవో

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులతో విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎంపీ వంశీ

జగిత్యాల: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందించారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ల్లో ఉన్నతస్థానాల్లో నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ రాంబాబు, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రశంసపత్రం అందుకున్నది వీరే..

ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా లోకిని శ్రీనివాస్, ఉత్తమ స్కూల్ అసిస్టెంట్లుగా బి.రాజేశం, రాంరెడ్డి, కాళీదాస్, భీమయ్య, సురేశ్, కృష్ణహరి, వెంకటేశ్, టి.శ్రీనివాస్, సయ్యద్‌పాషా, కుమారస్వామి, శ్రీనివాస్, మనోజ్‌కుమార్, షేక్ అసిఫ్‌అలీ, ఉత్తమ ఎస్జీటీలుగా సతీశ్, శ్రీకాంత్, అనూష, శ్రీనివాస్, వినోద్‌గౌడ్, రఘు, జయంత్‌కుమార్, రమాదేవి, నాగరాణి, నరేశ్ కుమార్, రాజు ఉన్నారు.

సోమవారం నుంచి పెద్దాపూర్‌లో పూర్తిస్థాయిలో తరగతులు

- ప్రారంభమైన ఇంటర్ తరగతులు
- శుక్రవారం మరికొన్ని తరగతులకు నిర్ణయం
- గురుకులానికి విద్యార్థుల హాజరు అంతంతే



పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో ఈనెల 9 (సోమవారం) నుంచి పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభంకానున్నాయి. గురువారం ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో వచ్చిన కొద్దిమంది విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం నుంచి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు నిర్వహించనున్నారు. మిగతా 5, 6, 7వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి సోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభిస్తున్నామని, పిల్లలను పంపించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు, ఫెన్సింగ్

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరగతి, వసతిగృహాల్లో సీసీ కెమెరాలు, గురుకులం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉపాధ్యాయుల ముందు ఉంచుతున్నారు. ఇప్పటివరకు చేసిన కొద్దిపాటి పనులు బాగానే ఉన్నా.. ప్రధానంగా ఈ రెండు అంశాలను పరిగణనలోనికి తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

ఆదివారంలోపు మరమ్మతు పూర్తి కావాల్సిందే

గురుకులంలో జరుగుతున్న మరమ్మతు పనులు ఆదివారంలోపు పూర్తికావాలని మెట్‌పల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆర్డీవో ఆదేశాలతో పెద్దాపూర్ గురుకులాన్ని ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే తరగతులు ప్రారంభించారు..? విద్యార్థుల ఎంతమంది వచ్చారు..? మిగతా తరగతులు పునఃప్రారంభంపై ఎందుకు తాత్సారం జరుగుతోందని తెలుసుకున్నారు. మరమ్మతు పనులు పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. జాప్యం చేయవద్దని, వెంటనే పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

మెడికల్ హబ్‌గా జగిత్యాల

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన వైద్యులకు అభినందనలు



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పడటంతో మెడికల్ హబ్‌గా మారిందన్నారు. జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంక్షేమ కేంద్రంలో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న గర్భిణికి వైద్యులు ప్రసూతి చేసి తల్లీబిడ్డలను కాపాడారు. వారిని గురువారం అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీ పోస్టుల భర్తీకి డీఎంఈతో మాట్లాడామన్నారు. రూ.10 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సూపరింటెండెంట్ రాములు, హెచ్‌వోడీ అరుణ, ఆర్‌ఎంవో యాకూబ్ పాషా, గీతిక పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

సీఎం సహాయనిధి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలకు చెందిన 14 మందికి రూ.3.22 లక్షల విలువైన చెక్కులను క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. నాయకులు రాజన్న, నారాయణ, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



ధర్మపురి: మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

- మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు
- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

ఇబ్రహీంపట్నం/ధర్మపురి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో.. ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉమామహేశ్వర్‌రావు, ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో రఘుచందర్ వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. రెండు సౌండ్ బాక్సులు పెట్టుకోవాలని, నిమజ్జనం సమయంలో మత్తు పదార్థాలు సేవించొద్దని సూచించారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై మహేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాలె గంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాలలో పనులను వేగవంతం చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి



కన్నాపూర్ పాఠశాలను పరిశీలిస్తున్న గౌతంరెడ్డి

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలలో ‘అమ్మ ఆదర్శ పాఠశాల’ కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. జగిత్యాలరూరల్ మండలం కన్నాపూర్, మోరపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు.. నాణ్యతగా చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధనతోపాటు, వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎంపీడీవో రమాదేవి, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యూలైన్‌లో రాజన్న భక్తురాలి మృతి

- మృతురాలు సిద్దిపేట జిల్లావాసి


విజయ (ఫైల్)

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు క్యూలైన్‌లోనే కుప్పకూలి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని చోటపల్లికి చెందిన కొత్తకొండ విజయ(50) గురువారం కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ వచ్చింది. రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తుండగా ఒక్కసారిగా కింద పడింది. స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోందని కుటుంబసభ్యులు తెలిపారు. విజయ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం

రామడుగు(చొప్పదండి): మండలంలోని షానగర్ శివారు వరద కాలువలో గురువారం ఉదయం ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు రామడుగు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని రామన్నపేటకు చెందిన పుల్లెల వెంకటమ్మ(82) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామ శివారులోని వాగులో దూకింది. నీటిలో కొట్టుకుపోయి, షానగర్ శివారులోని వరద కాలువలో గురువారం శవమై, కనిపించింది. మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆమె కొడుకు శేఖర్ వచ్చి, మృతదేహాన్ని గుర్తించాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని బొత్తల్లపల్లి గ్రామానికి చెందిన మేడవేని ప్రవీణ్(25) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ప్రవీణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి

రుద్రంగి(వేములవాడ): డెంగీతో బాధపడుతూ రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి(60) మృతిచెందాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రవి 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అయితే, ఓ ప్రైవేటు వైద్యుడు ఇంజెక్షన్ వేయడం వల్ల సెప్టిక్ అయిందని, మరో వైద్యుడు సెప్టిక్ అయిన చోట చీరడంతో రక్తస్రావమై రవి చనిపోయాడని స్థానికంగా ఆరోపణలొచ్చాయి. ఈ విషయమై రుద్రంగి ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సారంగాపూర్(జగిత్యాల): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కోట సంతోష్ రేషన్ లబ్ధిదారుల వద్ద 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి, తుంగూర్ గ్రామంలో నిల్వ చేశాడు. పోలీసులు పక్కా సమాచారంతో గురువారం రాత్రి వెళ్లి, పట్టుకున్నారు. సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డబ్బులు ఇవ్వట్లే.. తలనీలాలు పోగుచేసుకోవట్లే

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- పేరుకుపోతున్న తలనీలాలు
- స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఆరబెట్టిన రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆలయ అధికారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. 4 నెలలుగా సదరు కాంట్రాక్టర్ ఆలయానికి డబ్బులు చెల్లించకపోవడమే కాకుండా కల్యాణకట్టలోని తలనీలాలను పోగుచేసుకోవడం లేదు. దీంతో అవి పేరుకుపోతున్నాయి. ఇటీవలి భారీ వర్షాలకు తలనీలాలు పాడవుతాయని అధికారులు భావించారు. గురువారం సదరు కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తుల సమక్షంలో రాష్ట్ర దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(కరీంనగర్) సత్యనారాయణ పర్యవేక్షణలో స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఫ్యాన్ల కింద వాటిని ఆరబెట్టారు. ఆలయ ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకుడు నర్సయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, ఎస్పీఎఫ్ బందోబస్తు మధ్య ఈ కార్యక్రమం చేపట్టారు.


స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో ఆరబెట్టిన తలనీలాలు

చెక్కులు బౌన్స్.. కాంట్రాక్టర్‌కు నోటీసులు

వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించే తలనీలాలను పోగుచేసుకునే హక్కు కోసం ఆలయ అధికారులు రెండేళ్లకోసారి టెండర్లు పిలుస్తుంటారు. 2023–25 సంవత్సరానికి గానూ టెండర్ పిలవగా రూ.19.08 కోట్లకు సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ హిందూపూర్ దక్కించుకుంది. అయితే, సదరు కాంట్రాక్టర్ ఆలయానికి రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆయన ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా, ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టర్‌తోపాటు ఆలయ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సమక్షంలోనే తలనీలాలను ఓపెన్ స్లాబ్‌లోకి తరలించి, సాయంత్రం వరకు ఆరబెట్టారు. తర్వాత వాటిని 55 బ్యాగుల్లో నింపి, స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు.

సెల్లార్‌లోని షట్టర్లు కూల్చివేత

- సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దుకాణ సముదాయంపై చర్యలు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్‌కు చేదు అనుభవం ఎదురైంది. సిరిసిల్ల గోపాల్‌నగర్‌లో ఆయనకు దుకాణ సముదాయం ఉంది. అందులోని సెల్లార్‌లో షట్టర్లు నిర్మించారు. ఈ విషయం కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పలుమార్లు స్థానిక అధికారులకు, వరంగల్ ఆర్‌జేడీలోనూ ఫిర్యాదు చేశారు. అయినా స్పందన కరువైంది. దీంతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలు కూల్చివేయాలని ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు వైస్ చైర్మన్‌కు నోటీసులు అందించినా ఆయన స్పందించలేదు. దీంతో బల్దియా అధికారులే స్వయంగా రంగంలోకి దిగి, గురువారం సదరు కాంప్లెక్స్ సెల్లార్‌లోని షట్టర్లను కూల్చివేశారు.


షట్టర్లను కూల్చివేస్తున్న జేసీబీ

పూర్తిస్థాయిలో కూల్చాలి

గోపాల్‌నగర్‌లోని మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్‌కు చెందిన దుకాణ సముదాయంలోని సెల్లార్ షట్టర్లను పాక్షికంగా కూల్చివేశారు. నిబంధనలకు మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చాల్సి ఉంది. కోర్టు ఆర్డర్‌ను సైతం మున్సిపల్ అధికారులు బేఖాతర్ చేస్తున్నట్లు భావిస్తున్నాం. అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కాకుండా పూర్తిస్థాయిలో కూల్చాలి. లేని పక్షంలో మళ్లీ కోర్టుకు వెళ్తాం.

– నాగుల శ్రీనివాస్, బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు

సమగ్ర భూ సర్వే చేయండి

- ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పెద్దపల్లిరూరల్: సమగ్ర భూ సర్వే చేసి, చెరువు, కుంటలను కబ్జా చేసి, నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చి, ఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లే ప్రజలు తిరస్కరించి, కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. చెరువు కబ్జాలను గుర్తించి, అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఐ ఆధ్వర్యంలో హైడ్రాకు విన్నవించామని తెలిపారు. హైద్రాబాద్‌లో హైడ్రా చేస్తున్న పనులను ఆపుతామంటూ కొందరు దళారులు రంగప్రవేశం చేసి, అక్రమ నిర్మాణాలు చేపట్టినవారి నుంచి అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. అయితే, ఆక్రమణలను పూర్తిస్థాయిలో గుర్తించాలంటే సమగ్ర భూ సర్వే ఒక్కటే సరైన మార్గమని పేర్కొన్నారు. ఇటీవలి వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం అందించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు మోహన్, గౌతం గోవర్దన్, ఓదెమ్మ, స్వామి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం


విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి


బిర్లా స్కూల్ వేడుకల్లో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల(చొప్పదండి): మల్యాల ఎక్స్ రోడ్డులోని అల్ఫోర్స్ ఎస్ఎస్‌వీ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురుపూజోత్సవం ఘనంగా జరిపారు. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఉపాధ్యాయుల ద్వారానే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, దేశ భవితలో వారి పాత్ర గొప్పదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ బైపాస్ రోడ్డులోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కిండర్గార్టెన్ నుంచి పదోతరగతి తరగతి విద్యార్థుల వరకు తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పిల్లల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తిపై సైబర్ కేసు

- పోలీసుల అదుపులో కరీంనగర్‌వాసి?

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నీలోజిపల్లికి చెందిన ఎరుకల కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిపై సైబర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కిషన్‌కు తెలిసిన వ్యక్తి ద్వారా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, అతని బ్యాంకు కరెంట్ అకౌంట్ బుక్, సిమ్‌కార్డు తీసుకున్నాడు. వాటి నుంచి కిషన్‌కు తెలియకుండా లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. ఇది గుర్తించిన బాధితుడు తన ఖాతా నుంచి పెద్ద మొత్తంలో లావాదేవీలు చేస్తున్నాడని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆ గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, ఈ విషయంలో కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రమేయం ఉందన్న సమాచారంతో అతన్ని అదుపులోకి విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

‘మెడికవర్’లో ప్రొఫెసర్లకు సన్మానం

కరీంనగర్‌టౌన్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో వేడుకలు నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ, ప్రొఫెసర్లు పి.నితిన్, టి.రాజయ్య, ఆర్.సంజీవ్, ఎస్.రమేశ్ బాబు, వి.శ్రీనివాస్, ఎ.జ్యోతిలక్ష్మి, టి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సత్యప్రకాశ్, హరిజ్యోత్‌కౌర్, ఎం.ఆంజనేయులును సన్మానించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. గురువు భవిష్యత్తుకు బాటసారిగా నిలుస్తాడని, జ్ఞానాన్ని అందించే టీచర్ల రుణాన్ని విద్యార్థులు ఏ రూపంలోనూ తీర్చుకోలేరని అన్నారు. అలాంటి గురువులకు వైద్యపరంగా తమ వంతు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌కుమార్, అనీష్ పబ్బ, రాంచందర్, దిలీప్‌రెడ్డి, నాగరాజు, తాహా, రవిమల్లారెడ్డి, కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లను సన్మానిస్తున్న వైద్యులు

గంజాయి విక్రేతల అరెస్టు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ శివారులో గురువారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఇద్దరు యువకులు బైక్‌పై తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని, విచారించగా గంగాధర మండల కేంద్రానికి చెందిన కొడిమ్యాల అఖిల్, షేక్ ఖాసీం అని, గంజాయిని విక్రయించేందుకు వచ్చినట్లు తేలింది. గంగాధర మండలంలోని కాశిరెడ్డిపల్లికి చెందిన మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, వారు కొంత తాగుతూ.. మిగతాది సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. బైక్‌తోపాటు, 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఫోక్ సాంగ్స్ టు కన్నడ సినిమా

- అప్పన్నపేటకు చెందిన హోంగార్డుకు నటించే అవకాశం
- మహేశ్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో చూసిన అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్
- కృష్ణాష్టమి రోజు అక్కడి ప్రజలకు పరిచయం

పెద్దపల్లిరూరల్: ఫోక్ సాంగ్స్(జానపద పాటలు) పాడటం, వాటిలో నటించడం, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన హోంగార్డు అడప మహేశ్ హాబీ. సన్ననడుము చిన్నదానా, కుసుమపువ్వు తోటలో తదితర పాటలు అతనికి పేరు తీసుకువచ్చాయి. ఈ క్రమంలో మహేశ్‌కు ఉన్నట్టుండి సినిమాలో నటించే అవకాశం వచ్చింది. కన్నడ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ ఇన్‌స్టాగ్రామ్‌లో మహేశ్ ఫొటోను చూశారు. అచ్చం కన్నడ సినిమా ఆవేశయాలో నటించిన ప్రధాన పాత్రధారుడు బన్నంజేలా ఉండటంతో వెంటనే సంప్రదించారు. సినిమాలో అవకాశం ఇస్తానని చెప్పడంతో మహేశ్ కూడా అంగీకరించాడు. రాజేశ్ శ్రీకృష్ణాష్టమి రోజు కర్ణాటకలోని ఉడిపిలో నిర్వహించిన వేడుకలకు అతన్ని ఆహ్వానించి, సినీనటుడిగా అక్కడి ప్రజలకు పరిచయం చేశారు.


ఉడిపి కృష్ణాష్టమి వేడుకల్లో మహేశ్ (ఫైల్)

ఊహించలేదు..



కన్నడ సినీ నటుడిలా నేను ఉండటం.. నా ఫొటోను ఇన్‌స్ట్రాగామ్‌లో చూసిన అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ వేలాది మంది అభిమానుల మధ్య నన్ను నటుడిగా పరిచయం చేశారు. ఇది నేను ఊహించలేదు. పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న నాకు సినిమాలో అవకాశం ఇస్తున్నట్లు చెప్పగానే ఎంతో సంతోషించాను. ఫోక్ సాంగ్స్‌ను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న నాకు ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

– అడప మహేశ్, అప్పన్నపేట, పెద్దపల్లి మండలం

జాతీయ హాకీ టోర్నమెంట్‌కు ఎంపిక


మహేశ్

హుజూరాబాద్: పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు జరిగే 14వ భారత జూనియర్ హాకీ బాలుర జాతీయ టోర్నమెంట్‌కు తెలంగాణ జట్టులో హుజూరాబాద్ క్రీడాకారుడు తలకొక్కుల మహేశ్ ఎంపికయ్యాడు. కరీంనగర్ జట్టు తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. మహేశ్ ఎంపికపై అతని తల్లిదండ్రులు తలకొక్కుల చిరంజీవి–చంద్రకళ, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హాకీ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి సురేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాస్, హాకీ అసోసియేషన్ హుజూరాబాద్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కార్యదర్శి గనిశెట్టి ఉమామహేశ్, హాకీ సీనియర్ క్రీడాకారుడు, కోచ్ తిరునహరి శ్రీనివాస్, పలువురు క్రీడాభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ పెద్దపల్లి జిల్లా జడ్జి డాక్టర్ హేమంత్‌కుమార్ తీర్పునిచ్చారు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీ గోపాల్‌నగర్‌కు చెందిన శిలారపు గట్టయ్య(40) అనే డ్రైవర్ 2018లో స్థానిక ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి గురువారం గట్టయ్యకు శిక్ష ఖరారు చేశారు. సాక్షులను ప్రవేశపెట్టి, నేరాన్ని రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్ అభినందించారు.

హోటళ్లు, స్వీట్‌హౌస్, బేకరీలలో తనిఖీలు


బూజు పట్టిన అల్లం

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్లు, స్వీట్ హౌస్, బేకరీలలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్, బూజుపట్టిన అల్లం గుర్తించారు. కూల్‌డ్రింక్స్‌ను పారబోశారు. వాటిని నిల్వ ఉంచినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అధికారులు వస్తున్నారని తెలుసుకున్న కొందరు వ్యాపారులు తమ దుకాణాలు మూసివేసి, వెళ్లిపోయారు.


కూల్ డ్రింక్స్ పారబోస్తున్న అధికారులు

కోతికి భయపడి, గుండెపోటు

- చికిత్స పొందుతూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి


వెంకటయ్య (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కోతి భయపడిన ఓ వ్యక్తి గుండెపోటుకు గురయ్యాడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన ఎర్రవల్లి వెంకటయ్య (70) సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. మంగళవారం తన ఇంటి ఆవరణలోకి వచ్చిన కోతిని వెళ్లగొట్టే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో వానరం ఆయనపైకి రావడంతో భయపడ్డాడు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి చనిపోయాడు. గురువారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

కేశవపట్నంలో ఒకరికి డెంగీ

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నంలో ఒకరికి డెంగీ సోకినట్లు వైద్యాధికారి శ్రవణ్ తెలిపారు. బాధితుడి ఇంటితోపాటు చుట్టుపక్కల 50 ఇళ్లలో గురువారం మలేరియా సిబ్బంది పైరిథ్రమ్ ద్రావణాన్ని స్ప్రే చేశారు. అనంతరం ఎంపీవో ప్రభాకర్ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు.

‘అన్నపూర్ణ’లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు



ఇల్లంతకుంట(మానకొండూర్): అన్నపూర్ణ ప్రాజెక్టులోకి మిడ్ మానేరు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. అన్నపూర్ణలో ప్రస్తుతం 2.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు డీఈ దేవేందర్ తెలిపారు. మిడ్ మానేరు నుంచి 6,400 క్యూసెక్కుల నీరు వస్తుందని, ప్రాజెక్టు నుంచి రంగనాయక్‌సాగర్‌లోకి 6,600 క్యూసెక్కుల నీరు వెళ్తుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడ మున్సిపల్ పరిధి శాలరామన్నపల్లెకు చెందిన కదురు నరేశ్, తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన హర్షవర్ధన్(13) బైక్‌పై నందికమాన్ వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌లోకి వెళ్తుండగా కారు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

వానాకాలం.. కరెంట్‌తో జరభద్రం

- భారీ వర్షాల వేళ విద్యుత్ తీగలతో జాగ్రత్త
- ఇనుప స్తంభాలకు కరెంటు సరఫరా అయ్యే అవకాశం
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

మల్లాపూర్(కోరుట్ల): ఏటా వర్షాకాలం విద్యుదాఘాతంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈసారి భారీ వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల వద్ద, పంట పొలాల విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, ఇనుప స్తంభాలకు నేరుగా తాకొద్దని అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందని అంటున్నారు.

ఈ సూచనలు పాటించాలి..

- విద్యుత్ మీటర్లు, స్విచ్‌బోర్డులు, బల్బులు వర్షానికి తడవకుండా చూసుకోవాలి. ఇంట్లో కరెంటు వైరింగ్‌కు ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలి.
- దుస్తులు ఆరేయడానికి ఇనుప తీగలను ఉపయోగించకూడదు.
- తడి చేతులతో విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలు, హోల్డర్లు, సర్వీసు వైర్లు, స్విచ్‌లు, తాకొద్దు. పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్ బోర్డులు, విద్యుత్ పరికరాలు ఉంచాలి.


మొగిలిపేట శివారులో కరెంట్‌షాక్‌తో మృతి చెందిన రైతు (ఫైల్)

- ఉరుములు, మెరుపులు వచ్చి, వర్షం కురిసే సమయంలో గృహోపకరణాలు, టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలు, కంప్యూటర్లకు విద్యుత్ సరఫరా లేకుండా చూసుకోవాలి. ప్రమాదకరంగా ఉన్న తీగలను తొలగించాలి.
- విద్యుదాఘాతానికి గురైతే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.
- పొడి కర్రతో గానీ, విద్యుత్ సరఫరా కాని ప్లాస్టిక్ వస్తువులతో గానీ బాధితులను తప్పించి, ఆస్పత్రికి తరలించాలి.
- వ్యవసాయ విద్యుత్ మోటార్లకు తప్పనిసరిగా ఎర్త్ ఉండాలి.
- పంప్‌సెట్లు వర్షానికి తడవకుండా కవర్లు కప్పాలి.
- విద్యుత్ మోటార్ తీగలు బురదలో లేకుండా చూసుకోవాలి.
- విద్యుత్ మోటార్లను తడి చేతులతో తాకొద్దు.
- తీగలు తెగిపడితే లైన్‌మెన్‌కు లేదా ఎలక్ట్రీషియన్‌కు సమాచారం ఇవ్వాలి.

జాగ్రత్తగా ఉండాలి



వానాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. ఇళ్లు, శివారు ప్రాంతాలు, వ్యవసాయ భూముల వద్ద ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉంటే వీటిని నివారించవచ్చు.

– మనోహర్, ట్రాన్స్‌కో ఏడీఈ, మెట్‌పల్లి

సూచనలు పాటించాలి



విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంట్లో కరెంట్ వైరింగ్‌కు, వ్యవసాయ పంప్‌సెట్ల మోటార్లకు ఎర్త్ ఉండేలా చూసుకోవాలి. అధికారుల సూచనలు పాటించాలి.

– సాలియనాయక్, ట్రాన్స్‌కో ఎస్ఈ, జగిత్యాల

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్ : డిగ్రీ, PG, B.Tech., Diploma, D&B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM.4నెలల్లో పరీక్షలు.ఫోన్.8886977112,339 [HA-16389]

SERVICES

■ ఫింగో ఎంటర్‌ప్రైజెస్ అన్ని రకాల వ్యాపార ప్రాజెక్ట్‌లను అందిస్తుంది వ్యక్తిగత, వ్యవసాయ, విద్య DMA స్వాగతం, జీతం+కమీషన్, ✆ 9266809540. [T-279]

CHANGE OF NAME

■ I Hitherto known as YENGKHOM SUNDARI DEVI, D/o. MEDHASINGH YENGKHOM, Occupation: Pvt. Employee, R/o. H.No. 6-3-161, Khanpura, Karimnagar Town & District, Telangana State, shall henceforth be known as SARINAH SHARMEEN. [K-1246816]

WANTED

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796272]

■ సెక్యూరిటీగార్డ్స్ HYDలో చిలకలగూడ, సికింద్రాబాద్, కొంపల్లిలో కా. 12గం॥డ్యూటీ,జీ: 12,500 –13,500 + ఫ్రీ రూం & సె॥ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 2 సం॥ Exp. కా. రుద్రాక్ష్ సెక్యూరిటీ. 7702365554 [HA-14583]

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.